క్లుప్తంగా

నేటి నుంచి భాగవత సప్తాహం

తాళ్లరేవు: మండలంలోని ఇంజరంలో ఈ నెల 7 నుంచి 13 వరకూ భాగవత సప్తాహం నిర్వహించనున్నట్లు కాకరపర్తి సోమేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక శ్రీరుక్మిణీ సత్యభామ సమేత విజయగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో సాయంత్రం 4.30 గంటల నుంచి 6 గంటల వరకు సప్తాహం జరుగుతుందని చెప్పారు. ఓలేటి వేంకట బంగారేశ్వర శర్మ శ్రీకృష్ణతత్త్వంపై భాగవత సప్తాహం చేస్తారన్నారు.

కార్యకర్త కుటుంబానికి సాయం



శ్రీనుకు సాయం అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ శివన్నారాయణ

తాళ్లరేవు: ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న ఇంజరం పంచాయతీ అరటికాయలంక గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త సలాది శ్రీను కుటుంబానికి ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ సాయమందించారు. శనివారం శ్రీను ఇంటికి వెళ్లి పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సాయంతో పాటు 50 కిలోల బియ్యం, కిరాణా సరకులు అందజేశారు. కార్యక్రమంలో ఇంజరం సర్పంచ్ ముద్దన వెంకట శివరామ ప్రసాద్, కోరుకొండ చంటి, జాన్ తదితరులున్నారు.

స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలి

అల్లవరం: ఓడలరేవులోని చమురు కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఓఎన్జీసీ టెర్మినల్లో స్థానికులకు 75 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ ఓడలరేవు గ్రామస్తులు ఓఎన్జీటీ గేటు ముందు శనివారం నిరసన తెలిపారు. టెర్మినల్లో కాంట్రాక్టు పనులు నిర్వహిస్తున్న డీఆర్, ప్రోమోటెక్ కంపెనీలు స్థానికులకు ఉద్యోగాలు కల్పించకుండా ఇతర ప్రాంతాల వారిని నియమిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. స్థానికులకు ఉద్యోగాలు కల్పించకుండా నిర్లక్ష్యం చేస్తే సంస్థ కార్యకలాపాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మల్లాడి ఉమామహేశ్వరరావు, మధుర కుమారస్వామి, చొల్లంగి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెద్దగుండం అభివృద్ధి చేసి కల్వర్టు నిర్మించాలి

తాళ్లరేవు: పి.మల్లవరం పంచాయతీ పరిధిలోని సుమారు 500 ఎకరాల ఆయకట్టును ఆనుకుని ఉన్న పెద్దగుండాన్ని అభివృద్ధి చేసి, కల్వర్టు నిర్మించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రాజశేఖర్, వల్లు రాజబాబు డిమాండ్ చేశారు. శనివారం వారు పి.మల్లవరం పంచాయతీలో పర్యటించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ నీటి ఎద్దడి సమయంలో రైతుల్ని గట్టెక్కించడానికి, అధిక వర్షపాతం సమయంలో ముంపు నీటిని తరలించడానికి పెద్దగుండం ఉపయోగపడుతుందన్నారు. అందుకే పెద్ద గుండాన్ని అభివృద్ధి చేయడంతో పాటు ఉప్పు నీరు రాకుండా కల్వర్టు నిర్మించాలని కోరారు.

పాలిటెక్నిక్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

యానాం: యానాం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను వివిధ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ వేలాయుధం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. డిప్లొమో ఇన్ సివిల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, కంప్యూటర్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం, ఐటీఐ ఉత్తీర్ణులైనవారు అర్హులన్నారు. పుదుచ్చేరితో పాటు ఇతర రాష్ట్ర నివాసితులు సైతం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులను వచ్చే నెల 9లోగా సమర్పించాలని, మరిన్ని వివరాలకు 8317643747 ఫోన్ నెంబరులో సంప్రదించాలని కోరారు.

ఆసుపత్రి వ్యర్థాలు.. ప్రకృతికి అనర్థాలు



భీమనపల్లి పీహెచ్‌సీలో ఆరుబయట ఇష్టానుసారంగా పడేసిన ఆసుపత్రి వ్యర్థాలు

ఉప్పలగుప్తం: ఆసుపత్రుల్లో ఉపయోగించిన మందులు, ఇతర వ్యర్థాలను బయటకు పంపి సురక్షితంగా నిర్వీర్యం చేయాల్సి ఉంటుంది. అయితే మండలంలోని భీమనపల్లి పీహెచ్‌సీలో రోగులకు కట్లు కట్టి శుభ్రపరిచిన వ్యర్థాలను, శానిటైజర్, సెలైన్ బాటిళ్లు, గాజు సీసాలను బహిరంగ ప్రదేశాల్లో ఇష్టానుసారంగా పడేసి తగులబెడుతున్నారు. ఆసుపత్రిని ఆనుకుని జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలుర వసతి గృహం సైతం ఉన్నాయి. వ్యర్థాల నిర్వహణలో ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం వల్ల రోగులతో పాటు విద్యార్థులకు సైతం ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆసుపత్రి వ్యర్థాలను సురక్షితంగా డంపింగ్ యార్డ్‌కు తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

‘పది’లో సత్తా చాటారు

- అత్యుత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ విద్యార్థులు
- నిరుపేద కుటుంబాల్లో మెరిసిన విద్యాకుసుమాలు



అమలాపురం రూరల్: చదువుకి పేదరికం అడ్డుకాదని నిరూపించారు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు.. చదువుకోవాలనే సంకల్పం బలంగా ఉంటే, ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను ఉపయోగించుకుని అత్యుత్తమ ఫలితాల్ని సాధించొచ్చని చేసి చూపించారు. పేద, మధ్య తరగతికి చెందిన వీరి కుటుంబాల ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉన్నా, ప్రభుత్వ పాఠశాలల్లో చదివి టాపర్స్‌గా నిలిచి కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులకు తాము ఏమాత్రం తీసిపోమని నిరూపించారు. ప్రభుత్వం నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చడంతో అమ్మ ఒడి లాంటి పథకాలతో విద్యార్థులకు అండగా నిలబడుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు ఏ స్థాయిలో పెరిగాయో శనివారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పదో తరగతి ఫలితాలు చూస్తే అర్థమవుతోంది. ఏప్రిల్ 3వ తేదీ నుంచి 18 వరకూ జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలు శనివారం విడుదల నేపథ్యంలో ఇటు విద్యార్థుల్లో, అటు ఉపాధ్యాయుల్లో ఉత్కంఠ నెలకొంది. శనివారం ఉదయం 11 గంటల సమయానికి ఫలితాలు విడుదల కావడంతో ఇంటర్నెట్ సెంటర్ల వద్ద విద్యార్థుల హడావుడి కనిపించింది.

81 శాతం ఉత్తీర్ణత

అమలాపురం రూరల్ మండలంలో 81 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని మండల విద్యా శాఖాధికారి గుబ్బల సూర్య ప్రకాశరావు తెలిపారు. మండలంలో ఉన్న 16 జెడ్పీ ఉన్నత, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 2156 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 1750 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు.

92.86 శాతం ఉత్తీర్ణత

ముమ్మిడివరం: పదో తరగతి పరీక్షల్లో మండలంలో 92.86 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మండలంలో 729 మందికి పరీక్షలకు హాజరు కాగా 677 మంది ఉత్తీర్ణత పొందారు. వీరిలో బాలురు 400 మందికి గాను 372 మంది, బాలికలు 329 మందికి గాను 305 మంది ఉత్తీర్ణత సాధించారు.

ఐ.పోలవరంలో 89 శాతం ఉత్తీర్ణత

పదవ తరగతి పరీక్షల్లో ఐ.పోలవరం మండలంలో 89 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 696 మంది విద్యార్థులు హాజరు కాగా 620 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వీరిలో బాలురు 357 మందికి గాను 311 మంది, బాలికలు 339 మందికి గాను 309 మంది ఉత్తీర్ణత సాధించారు.

అల్లవరం: పదో తరగతి ఫలితాల్లో అల్లవరం మండలంలో 76 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని తొమ్మిది ఉన్నత పాఠశాలలు, రెండు గురుకులాల్లో 652 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 497 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు నిరుపేద కుటుంబాలకు చెందిన వారు కావడం గమనార్హం.

ఉప్పలగుప్తం: శనివారం విడుదలైన పది ఫలితాల్లో మండల వ్యాప్తంగా 56.7 శాతం ఉత్తీర్ణత సాధించారని మండల విద్యాశాఖాధికారి కె.కిరణ్ బాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో ఉన్న ఎనిమిది జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలకు 598 మంది విద్యార్థులు హాజరుకాగా వారిలో 339 మంది ఉత్తీర్ణులయ్యారని ఆయన తెలిపారు.

తాళ్లరేవు: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో తాళ్లరేవు మండలం 74.58 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో ఎ.మంగాయమ్మ తెలిపారు. మండలంలోని 22 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 1180 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 880 మంది ఉత్తీర్ణత సాధించారు.

కాట్రేనికోన: కాట్రేనికోన మండలంలో ఎనిమిది ప్రభుత్వ, మూడు ప్రైవేటు హైస్కూల్స్‌కు చెందిన 576 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా 303 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఎనిమిది జిల్లా పరిషత్ పాఠశాలలకు చెందిన 523 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 266 మంది విద్యార్థులు పాసయ్యారు. మొత్తంగా మండలంలో 51 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు.

యానాంలో 73.80 శాతం ఉత్తీర్ణత

యానాం: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో యానాం నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 73.80 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 8 ప్రభుత్వ పాఠశాలల నుంచి 271 మంది విద్యార్థులు పరీక్ష రాయగా అందులో 200 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు.

రక్తదానం

కొత్తపేట: స్థానిక వివేకానంద యోగా శిక్షణా కేంద్రం సభ్యులు అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేశారు. మండపేటకు చెందిన నడింపల్లి అనంతలక్ష్మికి కడుపులో కణితులు పెరగడంతో కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో జాయిన్ కాగా శస్త్ర చికిత్స సమయంలో అత్యవసరంగా రక్తం ఎక్కించాల్సి వచ్చింది. ఆమె కుటుంబ సభ్యులు వివేకానంద యోగా శిక్షణా కేంద్రం మాస్టర్ ఆకుల శ్రీనివాస్‌ను సంప్రదించారు. ఆయన తన శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న బండారు తేజ, సుంకర అనిల్, యలమంచిలి ప్రదీప్, దాసింశెట్టి ప్రవీణ్, దాసిరెడ్డి సుధాకర్‌లను అమలాపురం బుద్దాల నాగరత్నం మెమోరియల్ వలంటరీ బ్లడ్ సెంటర్‌కు తీసుకువెళ్లి రక్తదానం చేయించారు. శ్రీనివాస్‌కు, రక్తదాతలకు అనంతలక్ష్మి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

అనధికార కుళాయిల తొలగింపు

మామిడికుదురు: అప్పనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో అనధికార తాగునీటి కుళాయిలను తొలగిస్తున్నారు. మూడు రోజుల క్రితం అక్రమ కుళాయిల తొలగింపు పనులు మొదలు పెట్టారు. గ్రామంలో శివారు ప్రాంతాలకు తాగునీరు అందడం లేదని స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు అక్రమ కుళాయిలను తొలగిస్తున్నామని పంచాయతీ కార్యదర్శి కోటయ్య, సర్పంచ్ గెద్దం మంగాలక్ష్మి శనివారం తెలిపారు. గ్రామంలో సుమారుగా 50కి పైగా అనధికార కుళాయిలు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. కుళాయిలకు మోటార్లు అమర్చి వాటి ద్వారా తాగునీటిని ట్యాంకులకు మళ్లిస్తున్నట్లు గుర్తించారు. వీటిని తొలగించిన పక్షంలో శివారు ప్రాంతాలకు తాగునీరు సక్రమంగా అందుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో అక్రమ కుళాయిల తొలగింపునకు అధికారులు చర్యలు చేపట్టారు.

యువత అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



అరటికాయలంకలో అంబేడ్కర్ జయంతి సభలో మాట్లాడుతున్న మంత్రి విశ్వరూప్



పెదగాడవిల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి విశ్వరూప్ తదితరులు

తాళ్లరేవు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర రవాణా మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. శనివారం మండల పరిధిలోని ఇంజరం పంచాయతీ అరటికాయలంకలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తదితరులు అంబేడ్కర్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ముమ్మిడివరం నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్, వైఎస్సార్ సీపీ ఉభయగోదావరి జిల్లాల ప్రచార కమిటీ కన్వీనర్ చింతలపాటి శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

ఉప్పలగుప్తం: అంబేడ్కర్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మండలంలోని పెదగాడవిల్లి గ్రామంలో వల్లాయిచెరువు ప్రాంతంలో నిర్వహించిన అంబేడ్కర్ 132వ జయంతి వేడుకలకు శనివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అందరూ అంబేడ్కర్ బాటలో నడిచి బాగా చదువుకుని విద్యావంతులు కావాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు, సర్పంచ్ గుద్దటి వెంకట మహాలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు నిమ్మకాయల రాము, పార్టీ నాయకులు తాళ్ల నారాయణమ్మ, పెయ్యిల కొండబాబు, శ్రీలక్ష్మి, మెల్లం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలి



ముమ్మిడివరం అనాతవరంలో ధాన్యం రాశులను పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా తదితరులు

కలెక్టర్ హిమాన్షు శుక్లా

ముమ్మిడివరం: తుఫాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తమై ధాన్యాన్ని వెంటనే క్షేత్ర స్థాయి సిబ్బంది సహకారంతో రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు. ముమ్మిడివరం విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో రోడ్ల పక్కన ఉన్న ధాన్యం రాశులను శనివారం ఆయన పరిశీలించారు. అక్కడ ఉన్న రైతులను ఎందుకు ఇంకా ధాన్యం అమ్మలేదని ప్రశ్నించారు. తాము కమిషన్ ఏజెంట్ దగ్గర పెట్టుబడుల కోసం సొమ్ములు తీసుకున్నామని ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉన్నందున ఇంకా ఎండ బెట్టాలని చెప్పారని రైతులు పేర్కొన్నారు. దీనిపై కలెక్టర్ స్పందించి అక్కడ ఉన్న ఏఈఓ పి.కృష్ణయ్యను శాంపిల్ తీసి తేమ శాతం పరిశీలించాలని ఆదేశించారు. ఈ నెల 7న నుంచి తుఫాను వచ్చే అవకాశమున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినందున రైతులెవరూ కళ్లాల్లో ధాన్యం రాశులు ఉంచొద్దని కలెక్టర్ సూచించారు. రైతుల నుంచి ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. క్షేత్ర స్థాయిలో సిబ్బంది రైతులకు అవసరమైన గోనె సంచులు, హమాలీ కూలీలు, ధాన్యం మిల్లులకు తరలించే రవాణా సదుపాయం కల్పిస్తారని చెప్పారు. తడిసిన ధాన్యం, మొలకలు వచ్చిన ధాన్యం సైతం కొనుగోలు చేసేందుకు రైస్ మిల్లర్లకు సూచించామన్నారు. ధాన్యం తడవకుండా కాపాడుకోవడంతో పాటు వెంటనే రైసు మిల్లులకు తరలించాలన్నారు. అనంతరం ఆర్డీఓ వసంతరాయుడుతో కలిసి అనాతవరం రైలు మిల్లును తనిఖీ చేసి ధాన్యం కొనుగోలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. దిగుమతిలో జాప్యం చేయకుండా త్వరగా ట్రాక్టర్లు తిరిగి పంపాలని రైస్ మిల్లు యజమానికి సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ యడ్ల రాంబాబు, ఎంపీడీఓ ఏఎస్ శ్రీనివాస్‌లున్నారు.

సీఎం జగన్ వెంటే విశ్వబ్రాహ్మణులు



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన విశ్వబ్రాహ్మణ, స్వర్ణకార సంఘాల నాయకులు

అమలాపురం రూరల్: విశ్వబ్రాహ్మణులంతా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారని విశ్వబ్రాహ్మణ, స్వర్ణకార సంఘం నాయకులు స్పష్టం చేశారు. పట్టణంలోని 12 వార్డు కౌన్సిలర్ కట్టోజు సన్న్యయ్యదాసు ఇంటి వద్ద విశ్వబ్రాహ్మణ, స్వర్ణకార సంఘం నాయకులు శనివారం సమావేశమయ్యారు. స్వర్ణకార సంఘం మాజీ అధ్యక్షులు ఇంజరపు బ్రహ్మప్రకాష్, తాళాబత్తుల లక్ష్మణరావు, పట్టణ సంఘం అధ్యక్షుడు తాళాబత్తుల వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో విశ్వ బ్రాహ్మణులు అనేక సంక్షేమ పథకాల లబ్ధి పొందారని, చంద్రబాబు హయాంలో తమకు చేసిందేమి లేదన్నారు. విశ్వబ్రాహ్మణులు టీడీపీతో ఉన్నారంటూ విశ్వబ్రాహ్మణ మాజీ ఫెడరేషన్ చైర్మన్ సింహాద్రి కనకాచారి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

ఉచిత కంటి పరీక్షలు

మామిడికుదురు: వైఎస్సార్ కంటి వెలుగులో భాగంగా శనివారం పాశర్లపూడి గ్రామ పంచాయతీలో అవ్వా తాతలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఆప్తమాలజీ అధికారి హుస్సేన్ ఆధ్వర్యంలో 100 మందికి కంటి పరీక్షలు చేసి వారిలో కంటి శుక్లాలు సమస్యతో బాధపడుతున్న వారిని శస్త్ర చికిత్స కోసం అమలాపురం ఏరియా ఆస్పత్రికి పంపించారు. దీంతో పాటు ఇదే గ్రామ పంచాయతీలో ఫ్యామిలీ డాక్టర్‌లో భాగంగా నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.స్వర్ణలత ఆధ్వర్యంలో పలువురికి ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందించారు. దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న రోగి ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు, ఎంఎల్‌హెచ్‌పీ పి.ఇందిర, హెల్త్ అసిస్టెంట్ కె.సూర్యనారాయణ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వం రైతులను ఆదుకుంటుంది

జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యాన్‌చంద్



వేట్లపాలెంలో రైతులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ధ్యాన్ చంద్

కాట్రేనికోన: అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యాన్‌చంద్ అన్నారు. మండలంలోని వేట్లపాలెంలో అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యం, వరి చేలను శనివారం ఆయన పరిశీలించారు. ఈనెల 9న తుఫాను హెచ్చరికల నేపథ్యంలో మొలకెత్తిన ధాన్యాన్ని ముందుగా మండపేట రైస్‌మిల్లులకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలంలో 24 మెట్రిక్ టన్నులు మొలకెత్తిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాల్సి ఉందని వ్యవసాయశాఖ అధికారులు జాయింట్ కలెక్టర్‌కు తెలిపారు. రాశులుగా ఉన్న ధాన్యాన్ని లోకల్ రైస్ మిల్లులకు తరలించాలని, రైతులు నష్టపోకుండా ఉపాధి కూలీలను వ్యవసాయ పనులకు ఉపయోగించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ సానబోయిన నాగేశ్వరరావు, కొప్పాడి బాలకృష్ణ, వాసంశెట్టి శ్రీనివాస్, ఎంపీడీఓ కామేశ్వరరావు, ఏఓ ప్రవీణ్ తదితరులున్నారు.

సకాలంలో టీకాలు వేయించాలి

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల గ్రామ సచివాలయాల పరిధిలో ఆరోగ్య సిబ్బంది శనివారం చిన్నారులకు టీకాలు వేశారు. వైద్యాధికారులు ఎం.సుమలత, పి.భవానీశంకర్, ఆర్.సుదర్శన్‌బాబు, డి.సువర్చలనాయుడు ఆధ్వర్యంలో ఆలమూరు–2, కలవచర్ల, పినపళ్ల, సంధిపూడి, జొన్నాడ శివారు మూలాటి రేవు, చొప్పెల్ల, మోదుకూరు, నవాబుపేట, మడికి శివారు మల్లవాని తోట, మూలస్థాన అగ్రహారం తదితర గ్రామాల్లో అనేక మంది చిన్నారులకు ఆరోగ్య, ఆశ, అంగన్వాడీ సిబ్బంది టీకాలను వేశారు.

పూర్వ విద్యార్థుల మైత్రి సమ్మేళనం



మోరి ఉన్నత పాఠశాలలో మైత్రి సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సఖినేటిపల్లి: మోరి జాన సుబ్బమ్మ మెమోరియల్ జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం 1985–86 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు అపూర్వ మైత్రి సమ్మేళనం నిర్వహించారు. పాఠశాల స్థాపించి 60 సంవత్సరాలు పూర్తయిన సందర్భంలో వారంతా ఈ సమ్మేళనంలో భాగస్వాములయ్యారు. ఇదే బ్యాచ్‌కు చెందిన పాఠశాల హెచ్ఎం మద్దాలి వెంకటేశ్వరరావు సమ్మేళనానికి సహచర మిత్రులకు స్వాగతం పలికారు. జ్యోతి ప్రజ్వలన ప్రముఖ వైద్యనిపుణుడు జేవీబీ ప్రసాద్ నిర్వహించారు. ఉభయ తెలుగురాష్ట్రాల నుంచి సదరు బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యులతో తరలివచ్చారు. చదువుకున్న రోజుల్లో తీపి గుర్తులను నెమరువేసుకున్నారు. ఆద్యంతం ఆహ్లాదంగా, ఆనందంగా గడిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తరగతి గదుల్లో పాఠాలు నేర్పిన గురువులను సత్కరించుకున్నారు. కళా చంద్రశేఖర్, ముప్పర్తి శ్రీను, చింతా నేతాజీ, ఆకుల చినవెంకన్న నాయుడు, వలవల వీరకనకం, ఉప్పుగంటి విశ్వనాథం, మాలే సత్యనారాయణ, వలవల దొరబాబు, పెండ్లికట్ల శ్రీనివాసరావు, పోతురాజు కళాధర్ పాల్గొన్నారు.

బ్లూ మార్చ్‌కు అనుమతులు లేవు

రావులపాలెం: స్థానిక రావులపాలెం సెంటర్ ఆదివారం జరపనున్న బ్లూ మార్చ్‌కు పోలీసుల తరఫున ఎటువంటి అనుమతులు లేవని ఎస్సై ఎం.వెంకటరమణ శనివారం తెలిపారు. బ్లూ మార్చ్ వల్ల పొలిటికల్ గ్రూప్స్‌గా ఏర్పడి ప్రజాశాంతికి భంగం కలిగే విధంగా ఉన్నందున, నేషనల్ హైవేపై వాహనాలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందన్నారు. వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగే అవకాశం ఉన్నందున ఈ బ్లూమార్చ్ ర్యాలీకి అనుమతులు ఇవ్వలేకపోతున్నామన్నారు. ఈ కారణాలతో బ్లూమార్చ్ ర్యాలీకి అనుమతులు లేవన్నారు. ఈ విషయాన్ని గమనించి పోలీస్ వారికి సహకరించాలని ఎస్సై కోరారు.

రెవెన్యూ డివిజన్ టీమ్‌కు క్రికెట్ కిట్ బహూకరణ

కొత్తపేట: కొత్తగా ఏర్పడిన కొత్తపేట రెవెన్యూ డివిజన్‌లోని రెవెన్యూ డిపార్ట్‌మెంట్ డివిజన్ క్రికెట్ టీమ్‌కు శనివారం దాత క్రికెట్ కిట్‌ను బహూకరించారు. వెదిరేశ్వరం గ్రామానికి చెందిన దండు సూరిబాబురాజు రూ.56 వేలతో సమకూర్చిన క్రికెట్ కిట్‌ను రెవెన్యూ డివిజనల్ అధికారి ముక్కంటి చేతుల మీదుగా కార్యాలయంలో టీమ్ సభ్యులకు అందజేశారు.

శ్మశానవాటిక స్థలంలో చేపల మార్కెట్

అడ్డుకున్న భీమ్‌నగర్ తదితర గ్రామాల ప్రజలు



అధికారులతో మాట్లాడుతున్న భీమ్‌నగర్ తదితర గ్రామాల ప్రజలు

యానాం: యానాం– కనకాలపేట బైపాస్ రహదారి ముఖద్వారాన్ని ఆనుకుని ఉన్న భీమ్‌నగర్ దళితుల శ్మశానవాటిక స్థలంలో చేపల మార్కెట్ షెడ్లులు వేయడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారని తెలియడంతో శనివారం భీమ్‌నగర్, వికాస్‌కోలనీ, సిద్దార్థనగర్, యూకేవీనగర్ తదితర గ్రామాల ప్రజలు అధికారులతో వాగ్వాదానికి దిగి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ ద్విజ్‌గోయల్, సీఐ షణ్ముగం, ఎస్ఐలు శేరు నూకరాజు, పువ్వల వీరభద్రస్వామి ఘటనా స్థలానికి వచ్చి అక్కడ పరిస్థితిని పరిశీలించారు. ఎన్నో దశాబ్దాలుగా అదే స్థలంలో తమ గ్రామస్తులు చనిపోయినపుడు అంత్యక్రియలు నిర్వహించుకుంటున్నామని, అక్కడ షెడ్లులు వేస్తే సహించేది లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. యానాం పట్టణంలో రూ.5 కోట్లతో నిర్మించిన ఇందిరాగాంధీ మార్కెట్ కాంప్లెక్స్‌లో చేపల వ్యాపారం చేసుకుంటున్నారని, అక్కడ వదిలేసి మార్కెట్‌కు శ్మశానవాటికను కేటాయించాలని కోరడం భావ్యం కాదన్నారు. దళితుల శ్మశానవాటికను ఆక్రమిస్తే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీంతో అధికారులు వెనుదిరిగారు. భీమ్‌నగర్ హిందూ శ్మశానవాటికలో చేపల మార్కెట్ నిర్మాణానికి ప్రయత్నించడంపై ఎస్సీ, ఎస్టీ జాతీయ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు పలువురు యువకులు శనివారం విలేకరులకు తెలిపారు.

కోనసీమ రైల్వే లైన్ సాధనకు సమష్టి కృషి అవసరం



అంబాజీపేటలో మాట్లాడుతున్న రిటైర్డ్ న్యాయమూర్తి వెంకట ప్రసాద్

అంబాజీపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో నిలిచిపోయిన రైల్వే లైను పనుల సాధనకు అందరి సమష్టి కృషి అవసరమని కోనసీమ రైల్వే సాధన సమితి ప్రతినిధులు ఈఆర్ సుబ్రమహ్మణ్యం, కల్వకొలను తాతాజీ, సప్పా నాగేశ్వరరావులు అన్నారు. అంబాజీపేట కోనసీమ కోప్రా మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో మన కోనసీమకు రైలు కోసం శాంతియుత ప్రజా ఉద్యమంపై చర్చా వేదిక శనివారం నిర్వహించారు. కోకోఫెడ్ కన్వీనర్ అరిగెల బలరామమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ చర్చా వేదికల్లో పలువురు వక్తలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. పార్టీలకు అతీతంగా రైల్వే లైన్ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోనసీమ కోప్రా మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డి శ్రీరామకృష్ణ, మేడిద శ్రీనివాసరావులు అన్నారు. రానున్న రోజుల్లో కోనసీమ రైల్వే సాధన కోసం శాంతి యుత ర్యాలీ చేయాలని తాతాజీ పిలుపునిచ్చారు. అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అముడా)పై ప్రభుత్వం పునరాలోచన చేయాలని వక్తలు అన్నారు. అముడా విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా కోర్టు ద్వారా పరిష్కరించుకునేందుకు ప్రణాళిక రచించాలని రిటైర్డ్ న్యాయమూర్తి పులిదిండి వెంకట ప్రసాద్ సూచించారు. అనంతరం పలు తీర్మానాలను చర్చా వేదికలో ఆమోదించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, కోకోఫెడ్ ప్రతినిధులు ఆదిత్య కిరణ్, దాసరి వీవీ సత్యనారాయణ, బొంతు పెదబాబు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, పబ్బినీడి రాంబాబు, పితాని ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.